# చిరంజీవి*

[స్వగతం]

= శ్రీ శ్రీనివాసశిరోమణి =

నాకు క్షయ వచ్చింది అని నా మిత్రులందరూ విచారపడుతున్నారు. నా ఖండకావ్యము విపరీతావస్థలో వ్రాసిఉంటాను అని విచారపడుతూ నన్ను ఆదరిస్తూ ఒక మిత్రుడు ఉత్తరము వ్రాసినాడు. పాపము! వాళ్లకు తెలియదు—నేను ఎటువంటి దివ్యమయిన స్థితిలో ఉన్నానో వాళ్లకు తెలియదు. నా కోసము వాళ్లు ఎంతమాత్రమూ విచారించ నవసరము లేదని రుజువుచేస్తాను. నిజానికి ఇప్పుడు నాకు హాయిగా ఉంది. అక్కడికి, ఇక్కడికి పరుగెత్తవలసిన అవసరము లేదు. ఏక్షణానికి ఆక్షణము బ్రతుకులో సాగించవలసిన పోరాటముతో నిమిత్తము లేకుండా పోయింది.

నేను హాయిగా ఆలోచించుకొంటూ నా లోకములో నేను సుఖముగా ఉంటూఉంటే వాళ్లు అందరూ వచ్చి నన్ను చూచి విచారపడుతారు. నా సుఖము వాండ్లు ఎరగరు. నిజమే—నా జీవితారంభము జంఝామారుతముగా సాగిన మాట వాస్తవమే. కాబట్టి ఈ క్షయవ్యాధి వచ్చినందుకు వాళ్లు విచారపడుతున్నారు. లేచినప్పుడు గబగబా తిరగకుండా ఉంటేనూ, నియమబద్ధముగా ఉంటేనూ ఈ జబ్బు నయము అయిపోతుందని వాళ్లు అంటున్నారు. పయిగా నేను ఏమీ వ్రాయకుండా ఉండేట్లయితే మరీ తొందరగా నయము అయిపోతుందని చెపుతున్నారు.

ఇది నిజమే కావచ్చును. కాని జీవితము పెరుగుతోటకూర పెరిగినట్లు పెరగడము నాకు ఇష్టములేదు. నాది మానవజన్మ. నెమ్మదిగా, నిదానముగా వృద్ధిలోకి రావలెను. నేను క్షీణించిపోతాను అనే భయము లేదు. నా చిత్తము వచ్చినట్లు నేను నడుచుకొంటాను. నాకు ఈ నియమాలతో నిమిత్తము లేదు.

నేను లేస్తే దబదబా పరుగెత్తదలచుకొన్నాను. పడుకొంటే తీవ్రముగా ఆలోచించదలచుకొన్నాను. నా ఊహాకల్పనలకు అంతరాయము రాకూడదు.

పదిసంవత్సరాలపాటు నియమబద్ధముగా ఉంటే బాగా వృద్ధాప్యము వచ్చేవరకున్నూ జీవిస్తాను అని చెపుతున్నారు: అంటే నేను శాశ్వతముగా జీవిస్తాను అని వారి అభిప్రాయము. ఒకవేళ నేను హఠాత్తుగా మరణిస్తే?—మిగిలేది ఏమిటి?— నా ఊహాకల్పనలు, నా సౌందర్యపిపాస, నా కళారాధనా అంతా బుగ్గిపాలు అయిపోతుంది.

సరే, ఈ ఊపిరితిత్తులమీదనే నా చిత్తవృత్తులన్నీ కేంద్రీకరింపజేస్తాను. అందువల్ల కలిగే ప్రయోజనము?—ఈ ఊపిరితిత్తులకు ఇది హితము, ఇది అహితము అని జీవితాంతమువరకూ నిర్ణయించుకొంటూ నియమబద్ధముగా బ్రతకడమే ప్రయోజనము!

ఎవళ్లు ఏమి చెప్పినా క్షయ జీవితానికి అంతరాయముగా నాకు తోచడములేదు. నేను చచ్చిపోతాను అనే భయము నాకు లేదు. నేను దేహము చాలించవలె నని అనుకొన్నప్పుడే నేను చచ్చిపోతాను. ఈవిధముగా నా అంతరాత్మ చెపుతున్నది. ఇది విన్న వైద్యులు క్షయవ్యాధివాడి భ్రాంతి ఇట్లాగే ఉంటుంది అని అంటారు. వాళ్లు ఏమంటే నాకు ఏమి?—నేను అట్లా అనుకోవడము లేదు.

నేను ఇంకా మూడు కావ్యాలు చెప్పవలెను, రెండు నవలలు వ్రాయవలెను. అవి పూర్తి అయ్యేటంత

* క్షయవ్యాధిని గురించిన ఇంగ్లీషులోని ఒకానొక రచనను ఆధారముచేసి తెనుగున వ్రాసింది.

వరకున్నూ నాకు చావు లేదు. అవి పూర్తి అయిన తరువాత అసలు చావు అనేదే ఉండదు. నా భౌతిక దేహము పోతే పోతుంది. నారచనలతో నేను చిరంజీవిని గా ఉంటాను. అందువల్ల నేను చేయదలచుకొన్నది నేను మాని వేయను.

నేను ఇట్లా ఈ ఆస్పత్రిలో ఈమంచములో పడిఉండను. ఈ సంగతి నాకు తెలుసును. నాకృష్ణా తీరానికి నేను చేరుతాను. ఆ అఖండ కృష్ణ వేణీ స్రవంతి పావనోదకపానము చేస్తాను...

ఇంతకూ ఈక్షయవ్యాధికి భయపడను అవసరము లేదని మిత్రులకు తెలియడానికోసము ముఖ్యముగా ఇది వ్రాస్తున్నాను. మహాకావ్యరచనకు ఇంతకన్నా— ఈ వ్యాధికన్నా - తరణోపాయము ఈప్రపంచములో మరి ఒకటి ఉండదు. ఇంకా కాకపోతే యావజ్జీవిత కారాగృహ వాసము మహాకావ్యసృష్టికి దోహదము కావచ్చును. కాని చెరసాలలో కాయకష్టము చేయవలసిన అగత్యము ఉంటుంది. ఈక్షయవ్యాధివల్ల అట్లాంటిచిక్కులు ఏమిన్నీ లేవు. కాయకష్టము లేదు. వాళ్లూ వీళ్లూ వచ్చి చూసి అంతరాయము కలిగించడము అసలే ఉండదు. ఇక సంసారతాపత్రయము అనేదే అంతరించి పోతుంది. నిత్యజీవనము రెండు మూడు పనులతో తేలి పోతూ ఉంటుంది: కాస్త లేవడమూ కూర్చోడముతో సరిపోతుంది. కావలసినంత కావ్యసృష్టి చేయవచ్చును.

నా ఊహాలను గురించి ప్రశ్నించి నన్ను తికమక పెట్టేవారు ఎవరూ లేరు. నా ఊహాపరంపరలలో నేను యథేచ్ఛగా సాగిపోవచ్చును. ఒకరు నన్ను విందుకు పిలిచి కడుపునిండా తినమని బలవంతపెట్టే వారు లేరు. అంతే కాదు. నేను ఒకరిని విందుకు పిలిచి సుష్ఠుగా భోజనముపెట్టి సంతోషపెట్టవలసిన అవసరమున్నూ లేదు.

నేను హాయిగా పడుకొని నాచిత్తము వచ్చినట్టు కావ్యకల్పనము చేసుకొంటున్నాను. పాపము! వాళ్లు అందరూ భోజనభాజనాలకోసము నానా తంటాలు పడుతూఉంటారు.

నాకు...రావు వదులు వదులు ఇజార్లు తొడుగుకోడానికి పంపించినాడు. అవి అందినట్టూ, అవి నాకు చాలా నచ్చినట్టూ వ్రాయడానికి నాకు తీరిక లేదు. నేను వ్రాయకపోయినా అత డేమీ అనుకోడు. నాకు తెలుసును. నేను దుర్బలుణ్ణిగా ఉన్నాను అనీ, నన్ను చూచి మాట్లాడించకూడదు అనీ ఇక్కడి 'నర్సు' వచ్చిన వాళ్లు అందరితోనూ చెపుతున్నది. చాలా సంతోషము. నన్ను కదిలించి నా ఊహాకల్పనలకు భంగము రాకుండా చేసి వేసింది. చాలా బాగుంది.

నాకు బలము లేకపోవడము యథార్థమే అయి ఉండవచ్చును. అయితే బలానికిన్నీ ఒక హద్దు ఉంది. అమితబలమువల్ల ప్రయోజనము ఏమిటి?—అమిత బలవంతులందరూ సంసారతాపత్రయముకోసము నానా తంటాలూ పడవలెను. వారు చేసే ప్రతిపనినీ లోకము తప్పుపడుతూ ఉంటుంది. నాకో-ఆ చిక్కు లేదు. హాయిగా నా ఇష్టము వచ్చినట్లు ఏ అడ్డంకీ లేకుండా, ఏ విమర్శనమూ లేకుండా కావ్యసృష్టి చేసుకోవచ్చును.

నిజమే, నా స్నేహితులు అందరున్నూ నా కన్నా బలవంతులే: కాదు అని అనను. అయితే వారు చేసే పనికి ఫలితము ఏ సంవత్సరానికి ఆ సంవత్సరము జమాఖర్చు అయిపోతుంది. వారికి చివరకు మిగిలేది ఏమిన్నీ ఉండదు. నా విషయమో - అట్లా కాదు. ఈ జగత్తు అంతము అయ్యేవరకున్నూ నేను చేసేది అంతా నా పేర జమపడే ఉంటుంది.

నా మనశ్శక్తి ఈ నాడు అపారముగా ఉంది. అకుంఠితముగా ఉంది. ఇది నా వయస్సునుంచి కాదు. ఇది నా మనోధైర్యము అని అనడానికిన్నీ వీలులేదు. ఈ ప్రపంచములో ఎవరికీ లేని అవకాశము నాకు ప్రాప్తము అయింది. ఈ మహదవకాశమహాభాగ్యము మామూలుమానవులకు అలభ్యము. ఏమంటే కావ్యసృష్టికి విభావరి: వివిక్తప్రదేశము మహాఅవసరము. అవి లేనిదే మహాకావ్యరచన సాగదు. నాకు ఈ వివిక్త ప్రదేశము లభ్యము అయింది. ఈ సదవకాశము ఈ రాజయక్ష్మనుంచే సాధ్యము అయింది. జగత్తుతో సంబంధము లేని ఈ వివిక్తప్రదేశము ఆరంభములో భయంకరముగా తోస్తుంది. నాకున్నూ మొదట అట్లాగే తోచింది.

కాని ఈ వివిక్తప్రదేశము కొంచెము అలవాటు అయ్యేసరికి నా భావాలు వ్యోమవీథివరకున్నూ వ్యాపించినవి. ఇంతకన్నా రచయితకు ఈ జగత్తులో కావలసినది మరి ఒకటి లేదు. కావ్యకర్తకు ప్రత్యక్షజగత్తుతో నిమిత్తము లేదు. అతని జగత్తు అతనిదే. ఆ జగత్తులో భౌతికదేహాలు ఉండరాదు.

మహాకవికిన్నీ, తక్కినవారికిన్నీ ఇదే పెద్ద తేడా. గాయకుడు గీతసాధనము చేసేటప్పుడు సమక్షములో అనుచరగాయకులు ఉండవలెను. అనుచరులు వంతపాడుతూ ఉంటేనే సంగీతసాధనము సాధ్యము అవుతుంది. చిత్రకారుడు చిత్రరచన చేస్తూ ఉంటేనూ, శిల్పి మహాశిల్పరచనకు పూనుకొంటేనూ పక్కను మిత్రులు చేరి ఖులాసాకబుర్లు చెపుతూఉండవలెను. ఆ కబుర్లతోపాటు ఆ రచనను మిత్రులు మెచ్చుకొంటూఉండవలెను. నటుణ్ణి పారిషదులు మెచ్చుకొంటే తన పాత్రను యథాతథముగా నిర్వహించడానికి సాధ్యము అవుతుంది. కాని మహాకవికి అట్లా కాదు. ఒంటరిగా ఉండవలెను. ఏకాంతనివాసములోనే మహాకావ్యరచన సాధ్యము అవుతుంది.

చిన్నప్పుడే అన్ని చదువులూ చదివివేయడమువల్ల మహామేధావులు కారు. మేధోవృద్ధి పరిసరాలను పట్టి ప్రాప్తిస్తుంది. రాజయక్ష్మ వచ్చి ఏకాంత నివాసమే ప్రాప్తించకపోయినట్లయితే కీట్సుకవి ఇరవైఅయిదో ఏట అంత కావ్యరచన చేసిఉండడానికి సాధ్యము అయిఉండేది కాదు అని నా అభిప్రాయము. అంతే కాదు. షెల్లీ మహాకవి ఇరవై ఎనిమిదో ఏట ఈ రాజయక్ష్మతో పోరాటమే సాగించిఉండక పోయినట్లయితే అంతటి గ్రంథము తయారుచేసి ఉండేవాడు కాడు. ఈ రాజయక్ష్మవల్ల మహారచయితలు అయిన వారిని ఎందరినో పేర్కొనవచ్చును. జేన్ ఆస్టిన్, రాబర్ట్ లూయీస్టీవెన్ సన్, చెహో, స్టీఫెన్ కాలిన్సు ఫాస్టర్, ఎడ్గార్ ఏలెన్ పో, కేతరయిన్ మాన్సుఫీల్డ్—వీరందరున్నూ క్షయవ్యాధివల్లనే మహారచయితలు అయినారు.

ఈవ్యాధివల్లనే—ఇన్ని సంవత్సరాల ఈ వ్యాధివల్లనే నాకు ఇంతటి మనోబలము వచ్చింది. ఈ వ్యాధి వచ్చినవారికి వారివారి చిత్తవృత్తులు అన్నీ ప్రకోపిస్తవి అని వైద్యులు సిద్ధాంతము చేసినారు. దేహము చాలించేలోపల మానవుడి కల్పనాశక్తి అంతా ఈ వ్యాధివల్ల విజృంభిస్తుంది అని కొంతమంది అభిప్రాయము. దేహగత విషప్రకోపమువల్ల చిత్తము మహాతీవ్రగతిని సంచరిస్తుంది అని మరికొంతమంది అభిప్రాయము. ఈ సిద్ధాంతాలతో నాకు నిమిత్తములేదు. పయిగా ఈ సిద్ధాంతాలను గురించి నేను ఆలోచించడము అనవసరము. కావ్యరచనకు ఈ వ్యాధి చాలా ఉపయుక్తముగా నాకు కనబడుతున్నది.

పుట్టినందుకు పదికాలాలపాటు జీవించడము పరమార్థమా, కాక కవితచెప్పడము పరమార్థమా అని ప్రశ్నించవచ్చును. ఈ రెంటిలో ఏది పరమార్థమో నాకు తెలియదు. ఏది ముఖ్యమో కూడా నాకు తెలియదు.

నేను ఏది చేయడానికి సంకల్పించుకొన్నానో అది చేయడానికి అన్ని అవకాశాలూ ఈ వ్యాధివల్ల నాకు కలిగినవి. ఇంతకన్నా నాకు కావాలసింది ఏమి ఉంది?—అందువల్ల నా మిత్రులు ఎవరున్నూ నా కోసము విచారపడకూడదు అని నా అభిప్రాయము.

రాత్రిపూట చంద్రోదయము అవుతూ ఉంటే సముద్రము ఉప్పొంగినట్టు నా మనస్సు ఉప్పొంగిపోతూఉంటుంది. ఈ ఏకాంతవాసము ఎంత సుఖమో ఎవరూ తెలుసుకోలేరు. వీథులలో దుమ్ము రేగకొడుతూ కార్లూ, బండ్లూ పోతూఉంటే, వీథులలో జనము కిటకిటలాడుతూఉంటే, ఇంట్లో పిల్లలు, పెద్దలు అన్ని పనులకూ అన్యోన్యము అడ్డుతగులుతూ ఉంటే కావ్యరచనము ఎలా సాధ్యము అవుతుంది?—

ఈ మంచములో పడుకొనిఉంటే ఈ ప్రత్యక్షజగత్తుకు అతీతము అయిన మహాసౌందర్యము నాకండ్లకు పొడకడుతూ ఉంది. ఈ వ్యాధివల్ల నాకు కలిగిన ప్రయోజనాలను నా మిత్రులు గుర్తించలేకుండా ఉన్నారు. వారు నా కోసము విచారపడుతున్నారు. నా సంతోషము వారు ఎరుగకుండా ఉన్నారు.

నేను మహాకావ్యము చెపుతాను. నా కావ్యము చిరంజీవి అవుతుంది. దానితో నేను చిరంజీవినే అవుతాను.